కథ

వాణిశ్రీ

# రివెంజ్

"సార్! మినిష్టర్ పుల్లారెడ్డి పేషీ నుంచి ఫోన్" అంటూ కనెక్షన్ ఇచ్చాడు స్టెనో.

"ఏవయ్యా! కమీషనర్. మా జగ్గారెడ్డి ఫైనల్ బిల్లు పాస్ కాలేదంటనే. ఏంది యవ్వారం? రేపీపాటికి చెక్ ఇయ్యక పోతే మర్యాదగా ఉండదు"

ఇదీ మినిష్టర్ పేషీ నుంచి వచ్చిన వార్నింగ్.

కమీషనర్‌కి ముచ్చెమటలు పోశాయి. ఇక్కడ చార్జి తీసుకుని నెల దాట లేదు. తనమీద గవర్నమెంట్ లెవెల్లో కంప్లైంట్స్ వెళ్ళడం బాగుండదు అనుకున్నాడు.

సెక్షన్ ఆఫీసర్ని పిలిచాడు.

"జగ్గారెడ్డి ఫైనల్ బిల్లు పెండింగ్ వుందట" అడిగాడు కమీషనర్.

"భీమేష్ దగ్గర వుందేమో సార్!"

"వెంటనే పాస్ చేయించి చెక్ రెడీ చేయించు"

"భీమేష్ లీవులో వున్నాడు సార్!" నసిగాడు సెక్షన్ ఆఫీసర్.

"నాకు అదంతా తెలీదు. రేపీపాటికి చెక్ రెడీ కావాలి. మినిష్టర్ పేషీ నుంచి ఫోన్ వచ్చింది" అని విసుక్కున్నాడు కమీషనర్.

కమీషనర్ చాంబర్ నుంచి ముఖం వేలాడేసుకుని వచ్చాడు సెక్షన్ ఆఫీసర్.

"మనీష్!" అని పిలిచాడు.

"సార్!" అంటూ వచ్చి సెక్షన్ ఆఫీసర్ టేబుల్ ముందు నిలబడ్డాడు మనీష్.

"ఈ భీమేష్‌కి బుద్ధిలేదేమయ్యా! ఫైనల్ బిల్సు పెండింగ్ పెడతాడెందుకు? కంట్రాక్టర్లేమైనా అనామకులా? వాళ్ళ వెనక మినిష్టర్లుంటారు" చిరాగ్గా అన్నాడు సెక్షన్ ఆఫీసర్.

"ఏం జరిగింది సార్?" అడిగాడు మనీష్.

"నా బొంద జరిగింది. జగ్గారెడ్డి ఫైనల్ బిల్ పెండింగ్ పెట్టాడంట. రేపీపాటికి చెక్ ఇవ్వమని చిందులు తొక్కుతున్నాడు కమీషనర్. మినిష్టర్ పేషీ నుంచి ఫోనొచ్చిందట.."

మనీష్ మౌనంగా వుండిపోయాడు. భీమేష్ పక్క సీట్లో కూర్చున్న పాపానికి తన మెడకి త్రాచుపాములా చుట్టుకోదుగదా అని లోలోపల భయపడుతూనే వున్నాడు. అట్లానే జరిగింది.

"చూడు మనీష్! ఆ బిల్లు ఎక్కడ చచ్చిందో వెతికి పాస్ చేసిపెట్టు" అని బీరువా తాళాలు టేబుల్ మీద విసిరికొట్టాడు సెక్షన్ ఆఫీసర్.

మనీష్‌కి ముందు నుయ్యి, వెనుక గొయ్యిలా అనిపించింది. భీమేష్‌గాడు నిలువెత్తు లంచావతారం. ప్రతి బిల్లుకీ నజరానాలు రావాలంటాడు. రేపు రా, మాపు రా అని సతాయిస్తాడు. జేబులు నింపనివాళ్ళ పనులు చెయ్యడు. పట్టు విడుపులు లేవు. కొందరు ఫార్మాలిటీ అని డబ్బున్న కవర్లు డ్రాయరు సొరుగులో వేసి పోతారు. మరికొందరు పైసా రాల్చరు. గవర్నమెంటులో పట్టున్నవాళ్ళు ఆఫీసుకే రారు. అన్నీ ఫోన్లమీదే. భీమేష్ చూసీ చూడనట్లు పోవడం నేర్చుకోలేదు. గొంతు మీదకు వచ్చాక అప్పుడు కదుల్తాడు.

"భీమేష్ పెళ్ళికాకముందే ఇంత జిడ్డుగా వున్నాడంటే, ఇక పెళ్ళయి పిల్లలు పుట్టుకొస్తే జనాన్ని జలగలా పీక్కుతింటాడేమో?!" అని కొలీగ్స్ జోకులేస్తుంటారు.

'అటువంటివాడి పుట్టలో వేలు పెట్టడమా?' అని సందేహించాడు.

కానీ సెక్షన్ ఆఫీసర్ సుగ్రీవాజ్ఞ కాదనడానికి వీల్లేదు. తప్పుదు కూడా. బీరువా తీసి కొండను తవ్వి ఎలుకను పట్టాడు. జగ్గారెడ్డి బిల్ పాస్ చేసి చేతులు దులుపుకున్నాడు. మర్నాడు జగ్గారెడ్డి వచ్చి చెక్ తీసుకుని మనీష్‌కి షేక్‌హేండ్ ఇచ్చి థ్యాంక్స్ చెప్పి వెళ్ళిపోయాడు.

భీమేష్ సెలవు నుంచి తిరిగి వచ్చాడు.

"జగ్గారెడ్డి బిల్లు నువ్వు పాస్ చేసేవటగా! యస్.ఓ. చెప్పాడు" అన్నాడు.

మనీష్ తల వూపాడు.

"ఏమిచ్చాడు?" ప్రశ్నించాడు భీమేష్.

"చెయ్యిచ్చాడు" అన్నాడు మనీష్ చిరాకుపడుతూ.

భీమేష్ నమ్మలేదు. మనీష్ శీలం శంకించాడు.

"ఎంతో కొంత ఇచ్చివుండాలే! సీక్రెట్ ఫైల్లో దాచింది తీసి నువ్వు బిల్లు పాస్ చేశావుగా? ఊరికినే నీ పని మానుకుని చేస్తావా? నేను నమ్మను" నిష్ఠూరంగా అన్నాడు భీమేష్.

మనీష్‌కి కోపం నషాళానికి అంటిది. యస్.ఓ. చెప్పాడని వాడి పని నెత్తినేసుకుని చేస్తే తనను అనుమానిస్తాడా? అని చిర్రెత్తిపోయాడు.

"ఏవనుకుంటున్నావు నువ్వు? యస్.ఓ. చెప్పాడని పాస్ చేశాను. లేకపోతే నాకేం దురద? అనవసరంగా నోరు పారేసుకోకు. జగ్గారెడ్డి నాకేం ఇవ్వలేదు. కావాలంటే పోయి వాడినే అడుక్కో!" అన్నాడు మనీష్.

"నేను అడుక్కునేవాడినా? ఏమంటున్నావు నువ్వు?" అని భీమేష్ తెగ ఫీలయ్యాడు.

తర్వాత ఇద్దరిమధ్యా మాటల తూటాలు పేలాయి. యస్.ఓ. కొలీగ్స్ ఇద్దర్నీ శాంతపరిచి సీట్లలో కూర్చోబెట్టారు.

అప్పట్నుంచి ఇద్దరిమధ్యా మాటల్లేవు. పక్కపక్క సీట్లే అయినా ఎడమొఖం, పెడముఖంగా వున్నారు.

మనీష్‌కి మాత్రం తనను అవమానించిన భీమేష్ మీద రివెంజ్ తీసుకోవాలని కసిగా వుంది.

కొంతకాలం తర్వాత కొలీగ్ రాఘవేంద్రరావు పెళ్ళి కుదిరిన సందర్భంలో ఇచ్చిన మందుపార్టీలో ఇద్దరికీ రాజీ కుదిర్చారు కొలీగ్స్.

షాజహాన్ ఫాం హౌస్‌లో రాఘవేంద్రరావు ఇచ్చిన పార్టీలో రెండు రౌండ్లు తర్వాత భీమేష్, మనీష్‌లనిద్దర్నీ పట్టుకుని "మీరిద్దరూ ఒకే సెక్షన్లో పక్క పక్క సీట్లలో కూర్చుంటూ శత్రువుల్లా బిహేవ్ చెయ్యడానికి వీల్లేదు. షేక్‌హేండ్స్ ఇచ్చుకోండి" అంటూ చేతులు కలిపాడు మందేశ్వర్రావనే కొలీగ్.

ఊహించని పరిణామానికి భీమేష్, మనీష్ ముందు బిత్తరపోయి, ఆనక తేరుకున్నారు.

"ఛా..మనలో మనకి విరోధం ఏవుంది?" అన్నాడు మనీషే.

"ఔను. ఏం లేదు" అని భీమేష్, మనీష్ భుజం మీద చెయ్యి వేశాడు.

"వెరీగుడ్. గివ్ దెమ్ బిగ్ హేండ్స్" అని మందేశ్వర్రావు చప్పట్లు కొట్టాడు.

అంతా మందుగ్లాసులు టేబుళ్ళపై పెట్టి పెద్దగా క్లాప్స్ కొట్టారు.

"మీరిద్దరూ సేమ్ కేస్ట్ కదా! భీమేష్‌కి మంచి పెళ్ళి సంబంధం చూడు గురూ!" అని సలహా ఇచ్చాడు రాఘవేంద్రరావు.


మనీష్‌కి తన బాబాయి కూతురు భానుమతి మదిలో మెదిలింది.

"ఎవరైనా గవర్నమెంట్ జాబ్ వున్నవాడిని చూడరా" అని బాబాయి చెప్పిన మాటలు గుర్తొచ్చాయి. భీమేష్‌గాడి మీద రివెంజ్ తీసుకొనే ఛాన్స్ వి

వచ్చింది అనుకున్నాడు.

కొన్నిరోజుల తర్వాత భీమేష్‌ని చిలకలపాడులోని వాళ్ళ బాబాయి ఇంటికి తీసుకెళ్ళి భానుమతిని చూపించాడు. భీమేష్‌కి భానుమతి తెగ నచ్చింది. వాళ్ళ ఆస్తిపాస్తులు నచ్చాయి. వాళ్ళు చెప్పిన కట్నం ఫిగర్ విని ఇక మారు మాట్లాడలేదు.

భీమేష్‌కి, భానుమతికి పెళ్ళయింది. కొలీగ్స్ మనీష్ సహృదయతని మెచ్చుకున్నారు. మనీష్ మాత్రం రివెంజ్ తీర్చుకున్నందుకు ఆనందించాడు.




'ఒరేయ్ భీమేష్... ఇక నీ బతుకు కుక్క బతుకు. నీకు రోజూ నరకమే' అని తనలో తను నవ్వుకున్నాడు.

పెళ్ళయిన సందర్భంలో భీమేష్ తెగించి మందు పార్టీకి ఒప్పుకున్నాడు. మందు పార్టీల ఆర్గనైజర్ మందేశ్వర్రావు ఇచ్చిన ఎస్టిమేషన్ చూసి గుండెలు బాదుకున్నా, కట్నం భారీగా వచ్చినందున అంత డబ్బూ ఇచ్చుకున్నాడు.

మళ్ళీ ఫాం హౌస్ లోనే మందు పార్టీ జరిగింది. భీమేష్ మనీష్‌ని తెగ పొగిడాడు.

మనీష్ నవ్వుకున్నాడు.

పెళ్ళయిన మర్నాడో, అదే రోజునో సామాన్యంగా శోభనానికి ముహూర్తం పెడుతుంటారు. కాని ఎందువల్లనో డేట్స్ సరి చూసుకోనందువల్ల భానుమతి పెళ్ళయిన రోజే మెన్సస్ అయ్యిందంటూ పెళ్ళివారికి కబురు వచ్చింది. భీమేష్ నిరాశ పడ్డాడు. మళ్ళీ ముహూర్తం నిశ్చయించి కబురు చేస్తానన్నాడు మావగారు.

పదిరోజుల తర్వాత భీమేష్‌ని శోభనానికి రమ్మని ఫోన్ వచ్చింది. మనీష్‌ని కూడా తన వెంట రమ్మన్నాడు భీమేష్. తనకు వీలుకాదన్నాడు మనీష్.

భీమేష్ తల్లి, అక్క బావలతో చిలకలపాడు ప్రయాణమై వెళ్ళాడు.

* * *

కార్తీకమాసం. కార్తీకమంటేనే వెన్నెల. ఇక పౌర్ణమి నాడు చందమామ మంచుతెరలలో ఆడుకుంటూ వెన్నెల్ని వెదజల్లుతున్నాడు.

చిలకలపాడులో మామగారి మేడమీద గదిలో శోభనం ఏర్పాట్లు చేశారు. చుట్టూ పచ్చటి చెట్లు వెన్నెల్లో పరవశించిపోతున్నాయి. కొబ్బరిచెట్లు మంచు పడి చలికి వణుకుతున్నట్లు వూగుతున్నాయి.

పూలదండలతో అలంకరించబడిన టేకు పందిరి మంచం మీద తెల్లటి సిల్క్ లాల్చీ, పైజమా ధరించి, భానుమతి కోసం ఎదురుచూస్తున్నాడు భీమేష్. పూల పరిమళంతో, అత్తరు సువాసన, అగరు పొగలతో వుక్కిరిబిక్కిరై పోతున్నాడు. ఆ అనుభవం ఎప్పుడెప్పుడా అని నిమిషాలు, సెకన్లు లెక్కబెట్టుకుంటున్నాడు.

భానుమతి వంటి అందగత్తె తన భార్య అవుతుందని భీమేష్ కలలో కూడా వూహించలేదు. మంచి కట్నం ఆఫర్ వుంటే ఒక మాదిరి యావరేజ్ అమ్మాయినైనా ఓ.కె. అనాలనుకున్నాడు. ఎన్ని సంబంధాలు చూసినా రతీ, లక్ష్మి కటగలసిన రూపసి తారసిల్లలేదు. అనుకోకుండా మనీష్ బాబాయి కూతురు లక్కీగా దొరికింది. ఇదంతా మనీష్ సహృదయతే. సందేహం లేదు. తనతో చాలాకాలం విరోధంగా వున్నా అంతా మరిచిపోయి తన చెల్లెల్ని కానుకగా ఇచ్చాడు. వాడిని జీవి

తాంతం మర్చిపోలేదు. 'థాంక్యూ వెరీమచ్ మనీష్' వందోసారి అనుకున్నాడు భీమేష్.

ఘల్లు ఘల్లున గజ్జెల చప్పుడు వినిపించింది.

భానుమతి జరీ అంచుగల తెల్లటి చీరలో దివి నుండి భువికి దిగి వచ్చిన అప్సరసలా నెమ్మదిగా అడుగులో అడుగు వేసుకుంటూ భారంగా కదిలివస్తోంది.

ఆమె హొయలు, సోయగం గమనించి భీమేష్ గుండె వెయ్యి మైళ్ళ స్పీడుతో కొట్టుకుంది.

భానుమతి ఎందుకో అదోలా వుంది. ఆమె ముఖంలో ఆనందం తాండవించడం లేదు. మబ్బుల చాటున చందమామలా మసకేసి వుంది. యాంత్రికంగా పాలగ్లాసు అందించింది.

భీమేష్ మనసులో అనుమానం కదలాడింది. భానుమతి ఎందుకు సంతోషంగా లేదు? తొలిరేయి భర్త కౌగిలిలో పరవశించిపోయి స్వర్గసుఖాలు అందుకోవాలన్న ఆరాటమే ఆమెలో కన్పించడంలేదే. కనీసం సిగ్గుపడడం లేదు.

కొంపదీసి భానుమతి ఎవర్నయినా ప్రేమించిందా? తల్లిదండ్రుల బలవంతంతో తనను పెళ్ళి చేసుకుందా?

భీమేష్ గుండె గుభేలుమంది.

'ఏమండీ! నాకు విడాకులిచ్చి, నా ప్రియుడితో పెళ్ళికి సహకరించండి- అంటుందా ఏం?' అనుకున్నాడు.

"భానుమతీ! ఏమిటి అదోలా వున్నావు?" ఆమె చేతిని పట్టుకుని అడిగాడు.

అతని చేతిని విసిరి కొట్టింది. భీమేష్ షాక్ తిన్నాడు. భానుమతి అతని వైపు సీరియస్‌గా చూసింది. ఆమె పెద్ద పెద్ద కళ్ళతో వురుముతూ చూసేసరికి గుండె ఝల్లుమన్నది.

"ఏమండీ! మీరు నన్ను చంపడానికి కుట్ర చేస్తారా?" అని ప్రశ్నించింది.

భీమేష్ బిత్తరపోయాడు. తొలిరాత్రి భార్య భర్తను అడగవలసిన ప్రశ్నేనా ఇది?

"అదేంటి? అలా అడుగుతున్నావు?" అయోమయంగా అన్నాడు.

"ఔనండీ! ఎన్నో కేసులు టీవీలో చూస్తున్నాగా? నేరాలు-ఘోరాలు, మర్డర్లు, కట్నం చాలలేదని పెళ్ళికూతుళ్ళని కిర్సనాయిలు పోసి చంపుతున్నారు. గ్యాస్‌లో మండించి పైకి పంపిస్తున్నారు. నన్ను కూడా అలా చంపడానికి ప్లాను వేస్తున్నారా?"

భానుమతి అలా అడుగుతూ వుంటే, భీమేష్ మెదడు ఖరాబైపోయింది. గదంతా వేడిగా మండుతూ చెమటలు పట్టించింది. భీమేష్ తెలివితప్పి పడిపోయాడు.

○○○

మూడు రాత్రులు భీమేష్‌కి మూడు యుగాలుగా గడిచింది. వధువుని అత్తవారింటికి పంపించారు. శోభనం అయిన దగ్గర్నుంచి భీమేష్ మూడీగా వుండడం, పిచ్చివాడిలా తనలో తనే గొణుక్కుంటూ వుండడం చూసి తల్లి, అక్క ఏం జరిగిందని అడిగారు. భీమేష్‌కి ఏం చెప్పాలో తోచడం లేదు.

"మనింటికి వెళ్ళాక మీకే తెలుస్తుందిలే" అన్నాడు.

వాళ్ళకి ఏమిటో అసలు సంగతి అర్థం కాలేదు.

అత్తగారింటికి వెళ్ళిన మర్నాడు వంట గదిలోకి వెళ్ళి తనే స్వయంగా కాఫీ కలిపి ముందు మామగారికి ఇచ్చింది.

కాఫీ కప్పు అందుకుంటూ "అంతా కులాసానా మీ ఇంట్లో?" అని పలకరించాడు.

"ఊ..." అని "మామగారూ! నన్ను చంపడానికి మీరు కుట్ర చేస్తున్నారా?" అని ప్రశ్నించింది భానుమతి.

కాఫీ సిప్ చేసిన ఆయనకు పొలమారి వుక్కిరిబిక్కిరై పోయి కోడలి వైపు అయోమయంగా చూశాడు. కొన్ని క్షణాల వరకూ ఆమె అడిగిందేమిటో అర్థం కాలేదు. భ్రమ పడుతున్నానా అని చేతిని గిల్లి చూసుకున్నాడు. అంతా నిజమే. భ్రాంతి కాదు. ఎదురుగా కోడలు నిలబడి వుంది.

"భలేదానివమ్మా! అవేం మాటలు" అన్నాడు బలవంతంగా పెదవులపైకి నవ్వు తెచ్చుకుంటూ.

ఇక అత్తగారి వంతు వచ్చింది. కోడలు కాఫీ కలిపి తెచ్చినందుకు సంబరపడిపోతున్న ఆమెకు, ఆ సంబరం కొన్ని క్షణాలు నిలవలేదు.

"అత్తయ్యా! నన్ను చంపడానికి కుట్ర చేస్తున్నారా?"

కోడల్ని చూసి అత్తకి నిలువు గుడ్లు పడిపోయాయి.

ఇక అప్పట్నుంచి అత్త, మామలు, ఆడబిడ్డ భానుమతి కంటపడడానికే భయపడిపోయి, ఆమెను తప్పించుకుని తిరగసాగారు.

భీమేష్, మనీష్‌కి ఫోన్ చేసి "ఇదేం గొడవ? ఇలా అందర్నీ అనుమానిస్తుందేం?" అని మొత్తుకున్నాడు.

"మా బాబాయి కూతురికి షిజోఫ్రెనియా అనే మెంటల్ జబ్బుంది. అంటే అనుమానం జబ్బు. లేకపోతే అంత కట్నం ఇచ్చి, నీలాంటి వెధవాయికి పెళ్ళెందుకు చేస్తారు?" అన్నాడు మనీష్.

మనీష్ సహృదయత ఏమిటో అర్థమై బావురుమన్నాడు భీమేష్.

○

## అదీ రహస్యం!

అసలు పేరు అర్చన నుంచి వేదగా మారి సినిమాల్లోకి వచ్చి, ఆ తర్వాత ఆ పేరు కలిసి రాలేదేమో అని వేదా శాస్త్రిగా మార్చుకుని, ఇప్పుడు తిరిగి 'అర్చన'గానే స్థిరపడిన అర్చనకి అదృష్టం కలిసి రావడంలేదు. గ్లామర్, నటన విషయంలో ఎలాంటి మైనస్‌లు లేకపోయినా సినిమాలు లేవు. అడపాదడపా నటిస్తున్న అర్చనని మీ పర్సనాలిటీ ఇంత తీరుగా చక్కగా వుండడానికి మీరేం చేస్తారు అంటే- 'ఏం లేదు, క్రమం తప్పకుండా డాన్స్ చేయడమే' అంటుంది. రోజుకి కనీసం గంటైనా డాన్స్ చేస్తుందిట శాస్త్రీయ నృత్యకారిణియైన అర్చన.

